సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 66.433 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 66.433 టీఎంసీలు ఉన్నాయి. 1694 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3,950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.85,520
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,762
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,995
సవర (8 గ్రాములు)	రూ.63,960

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /21.4

జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

అన్యాయంగా తొలగించారు

- కోర్టు ఉత్తర్వులను అధికారులు అమలు చేయడం లేదు
- దగదర్తి ఫీల్డ్ అసిస్టెంట్ల ఆవేదన



దగదర్తి మండలంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లు

నెల్లూరు (పొగతోట): సంవత్సరాలు తరబడిగా పనిచేస్తున్న తమను కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం విధుల నుంచి తొలగించారని దగదర్తి మండలానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు మాల్యాద్రి, వాణి, పుల్లయ్య, వెంకటరమణయ్య, వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం డ్వామా పీడీ గంగాభవానిని కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ మండలంలో గత 15 ఏళ్ల నుంచి ఉపాధి హామీలో పని చేస్తున్నామన్నారు. మండలంలో 12 మందిని అన్యాయంగా విధుల నుంచి తొలగించారన్నారు. కోర్టును ఆశ్రయించామని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించిందన్నారు. కోర్టు ఉత్తర్వులను సైతం అధికారులు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పకడ్బందీగా ప్రాక్టికల్స్ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఐఓ కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు, ప్రాక్టికల్ సామగ్రి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రాక్టికల్స్ నిర్వహించాలన్నారు. ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు జిల్లా వ్యాప్తంగా 21 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒకేషనల్‌లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 1,245 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,030 మంది హాజరుకానున్నట్లు చెప్పారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఈ నెల 1న నైతిక పరీక్షకు 27,929, మానవీయ విలువల పరీక్షకు 27,921 మంది హాజరయ్యారు. ఈ సమావేశంలో డీఈసీ కమిటీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక కూటమి ప్రభుత్వంపై పోరాటం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, రమాదేవి



మాట్లా దుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజావ్యతిరేక కూటమి ప్రభుత్వంపై సీపీఎం ప్రజా అజెండాతో రాజకీయ పోరాటానికి సిద్ధమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, రమాదేవి తెలిపారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా మూడో రోజు సోమవారం పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి సర్కార్ సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆదాయం పెరగకుండా, వారి కొనుగోలు శక్తి పెంచకుండా ఏ విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. విజన్ 2047 ప్రజల కష్టాలు తీర్చేదిగా లేదని, కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర సంపదను దోచి పెట్టేలా ఉందని ఆరోపించారు. 21 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్రం నుంచి ప్రధాని మోదీ ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఎందుకు తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. మెగా డీఎస్సీను వెంటనే ప్రకటించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయలను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ వైద్యశాలలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.

కుతంత్ర ఎన్నికల్లో టీడీపీ అభాసు

టీడీపీ కుతంత్ర రాజకీయాలకు డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ ఎన్నికలు వేదికగా నిలిచాయి. అసలు టీడీపీ ప్రాతినిధ్యం లేని నెల్లూరు కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ పదవిని, ఇద్దరు కౌన్సిలర్ల ప్రాతినిధ్యం వహిస్తున్న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో రెండు వైస్ చైర్మన్ల పదవులను ఆ పార్టీ తన ఖాతాలో వేసుకోవడం చూసి జిల్లా ప్రజలు విస్తుపోతున్నారు. అభ్యర్థులకు టీడీపీ తరఫున కనీసం బీ–ఫారం కూడా జారీ చేయలేక ఫిరాయింపుదారులను ఇండిపెండెంట్లుగా నిలబెట్టి.. జైకొట్టి అభాసుపాలైంది. విప్ ధిక్కరించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లపై అనర్హత వేటు వేసేందుకు ఆ పార్టీ న్యాయపోరాటానికి సిద్ధమవుతోంది.

డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ల ఎన్నికల్లో చేతులెత్తేసిన టీడీపీ

- ఆ పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెట్టలేని దుస్థితి
- ఫిరాయింపుదారులకే జైకొట్టిన వైనం
- మీడియా ముందు మాట్లాడలేక మాట దాటేసిన ఎమ్మెల్యేలు
- నైతిక విజయం మాదేనంటున్న వైఎస్సార్‌సీపీ
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్న ఆ పార్టీ
- విప్ ధిక్కారణతో అనర్హత వేటు కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం



ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తున్న ప్రిసైడింగ్ అధికారి, జేసీ కార్తీక్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వైస్ చైర్మన్ల ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులు ఫిరాయింపుదారుల మద్దతుతో గెలుపొందారు. టీడీపీ తన పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెట్టలేక చేతులెత్తేసింది. వైఎస్సార్‌సీపీ విప్ బ్రహ్మాస్త్రంతో టీడీపీ ఫిరాయింపుదారులకే జైకొట్టాల్సి వచ్చింది. గెలుపొందిన అభ్యర్థులకు ఇచ్చిన డిక్లరేషన్ పత్రంలో కూడా ఫలానా పార్టీ అని కూడా ధ్రువీకరించలేదు. కనీసం ఇండిపెండెంట్ అని చూపించలేక.. ఏకంగా ఆ కాలమ్‌నే ఎత్తేశారు. ఎన్నికలు జరిగే సమయంలో అభ్యర్థులు ఏ పార్టీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారో కూడా ఎన్నికల అధికారులు చెప్పకపోవడం చూస్తే.. టీడీపీ ఏ స్థాయికి దిగజారిపోయిందో ఈ ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యేలు సైతం విజేతలు ఏ పార్టీ వారిని అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. దాటవేసి వెళ్లిపోయారు.

రూటుమార్చిన టీడీపీ

నెల్లూరు డిప్యూటీ మేయర్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ఉప చైర్మన్ల ఎన్నికల్లో నైతిక విజయం కోసం వైఎస్సార్‌సీపీ విప్‌తో రాజకీయ వ్యూహం పన్నింది. దీంతో టీడీపీ రూటు మార్చుకుని కుతంత్ర రాజకీయాలకు తెరతీసింది. ఆ పార్టీ అభ్యర్థులుగా చెప్పుకునే వారికి కనీసం బీఫారం కూడా జారీ చేయలేకపోయింది.

విప్ వ్యూహం.. ధిక్కారణ భయం

ఐదు రోజులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సారథ్యంలో నెల్లూరు నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరురూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. నిత్య సమీక్షలు, న్యాయనిపుణులతో చర్చలు, పార్టీ అధిష్టానం ఆదేశాలతో ఫిరాయింపుదారులపై విప్ బ్రహ్మాస్త్రంతో ఆట మొదలు పెట్టారు. వైఎస్సార్‌సీపీ పన్నిన వ్యూహంతో టీడీపీ ఎమ్మెల్యేలు సైతం పోటీలో ఉన్న వారు తమ పార్టీ అభ్యర్థులని మీడియా ముందు బహిరంగంగా చెప్పుకోలేకపోయారు. అయితే ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లపై అనర్హత వేటు పడేలా వైఎస్సార్‌సీపీ న్యాయపోరాటానికి సిద్ధమవుతోంది. 91వ రాజ్యాంగ సవరణపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారు. ముందుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఆపై న్యాయస్థానంలో పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామాలతో ఫిరాయింపుదారుల్లో ఆందోళన నెలకొంది.

మీడియాతో మాట దాటవేత

టీడీపీ ఎమ్మెల్యేలు ఎన్నికల అనంతరం మీడియా ముందు ముభావంగా మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గెలిచిన అభ్యర్థులు మా పార్టీ వారే అని చెప్పుకోలేకపోయారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే పోటీకి పెట్టామంటూ మాట దాటవేశారు. ప్రతిపక్ష పార్టీపై నిప్పులు చెరిగే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సైతం ముభావంగా మాట్లాడారు. ఎవరూ కూడా గెలిచిన వారు మా పార్టీ అభ్యర్థులు అని చెప్పుకోలేక పోయారు.

నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే

నెల్లూరు డిప్యూటీ మేయర్‌గా గెలుపొందిన సయ్యద్ తహసీన్, బుచ్చిరెడ్డిపాళెం వైస్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన యర్రబపల్లి శివకుమార్‌రెడ్డి, షేక్ నస్రీన్ వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తుపై గెలిచిన కార్పొరేటర్, కౌన్సిలర్లు కావడం గమనార్హం. నెల్లూరు కార్పొరేషన్‌లో అసలు టీడీపీకి ప్రాతినిధ్యమే లేదు. ఉన్న 54 డివిజన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందిన కార్పొరేటర్లే ఉన్నారు. వీరిలో కొందరికి అనైతికంగా టీడీపీ కండువాలు కప్పింది. తాజాగా జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కనీసం టీడీపీ బీఫారంతో అభ్యర్థిని నిలబెట్టలేక చేతులెత్తేసి.. ఫిరాయింపు కార్పొరేటర్‌ను ఇండిపెండెంట్‌గా బరిలోకి దింపింది. ఫిరాయింపు కార్పొరేటర్లతో ఓట్లు వేయించుకుని విజయం టీడీపీదే అంటూ ప్రకటించుకుంది. ఇక బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో 20 మంది కౌన్సిలర్లకు గాను టీడీపీకి ఇద్దరే ఉన్నారు. మిగతా 18 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ బీఫారంతో గెలుపొందిన వారే కావడం గమనార్హం. ఇక్కడ కూడా టీడీపీ ఫిరాయింపు కౌన్సిలర్లను ఇండిపెండెంట్లుగా బరిలో నిలబెట్టి.. జైకొట్టింది. అయితే నైతిక విజయం వైఎస్సార్‌సీపీదేనని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

డిప్యూటీ మేయర్‌గా తహసీన్ ఎన్నిక



వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతుగా చేతులెత్తిన ఆ పార్టీ కార్పొరేటర్లు, ఎమ్మెల్సీ



ఇండిపెండెంట్ అభ్యర్థికి మద్దతుగా చేతులెత్తిన ఫిరాయింపు కార్పొరేటర్లు

- ఎన్నికలకు మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, మేయర్ స్రవంతి డుమ్మా

నెల్లూరు(బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థి పోటీ చేసి విజయం సాధించారు. సోమవారం ఎస్ఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో అధికారులు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ వ్యవహరించారు. కార్పొరేషన్ పరిధిలో 54 డివిజన్లు ఉండగా, 43వ డివిజన్ నుంచి గెలిచి, డిప్యూటీ మేయర్‌గా ఉన్న ఖలీల్ అహ్మద్ రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. మొత్తం 53 మంది కార్పొరేటర్లు ఉండగా, 12వ డివిజన్ నుంచి ప్రాతినిధ్య వహిస్తున్న మేయర్ పొట్లూరి స్రవంతి, 38వ డివిజన్ కార్పొరేటర్ దాసరి అమృత గైర్హాజరయ్యారు. చివరకు 51 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

10 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

ఈ ఎన్నికల ప్రక్రియలో 51 మంది కార్పొరేటర్లతోపాటు కోఆప్షన్ సభ్యులుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. అయితే కోఆప్షన్ సభ్యులుగా ఉన్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డుమ్మా కొట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించగానే వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్ 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున ఈ ఎన్నికలకు సంబంధించి తాము విప్ జారీ చేస్తున్నామని లిఖిత పూర్వకంగా తెలియజేశారు.

అభ్యర్థులుగా ప్రతిపాదన

డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైఎస్సార్‌సీపీ నుంచి 42వ డివిజన్ కార్పొరేటర్ షేక్ కరిముల్లాను ప్రకటిస్తూ 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ ప్రతిపాదించగా, 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు మహేష్ బలపరిచారు. టీడీపీ తరఫున ఎవరూ లేకపోయే సరికి చివరకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా 48వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ తహసీన్‌ను 33వ డివిజన్ కార్పొరేటర్ కరణం మంజుల ప్రతిపాదించగా 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి బలపరిచారు. దీంతో డిప్యూటీ మేయర్ పోటీలో ఇద్దరు అభ్యర్థులు షేక్ కరిముల్లా, సయ్యద్ తహసీన్ ఉన్నారని ఎన్నికల అధికారి ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 12 మంది మద్దతు

డిప్యూటీ మేయర్‌గా షేక్ కరిముల్లానే కావాలని చేతులెత్తి తమ మద్దతు తెలపాలని ఎన్నికల అధికారి కోరారు. 11 మంది కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మొత్తం 12 మంది చేతులెత్తి తమ మద్దతు తెలియజేశారు.

ఇండిపెండెంట్ అభ్యర్థికి 41 మంది..

ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో ఉన్న సయ్యద్ తహసీన్ కావాలని చేతులెత్తి తమ మద్దతు తెలపాలని ఎన్నికల అధికారి కోరగా, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, 35 మంది కార్పొరేటర్లు చేతులెత్తి తమ మద్దతు తెలియజేశారు. ఐదుగురు తటస్థంగా ఉండిపోయారు. మరోసారి చేతులెత్తాలని ఎన్నికల అధికారి కోరగా ఆ ఐదుగురు తోపాటు మొత్తం 41 చేతులెత్తారు. దీంతో ఇండిపెండెంట్ అభ్యర్థి సయ్యద్ తహసీన్‌ను డిప్యూటీ మేయర్‌గా ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు. డిప్యూటి మేయర్ ఏ పార్టీకి చెందిన అభ్యర్థి అని తెలియజేయాలని ఎన్నికల అధికారిని ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి కోరగా, అందుకు ఏదైనా ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయండి అంటూ సమాధానం ఇచ్చి ఎన్నిక ప్రక్రియను ముగించారు.



పార్టీ కండువాలతో హాజరైన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



ముందు జాగ్రత్తగా పార్టీ కండువాలు లేకుండా అభ్యర్థులతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

వైస్ చైర్మన్లుగా ఇండిపెండెంట్ల విజయం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఇండిపెండెంట్లు విజయం సాధించారు. సోమవారం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి శ్రీధర్‌రెడ్డి ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. దీంతో వైఎస్సార్‌సీపీ తరఫున చీఫ్ విప్ షేక్ షాహుల్ తమ పార్టీ కౌన్సిలర్లు 18 మందికి విప్ జారీ చేసినట్లు ఎన్నికల అధికారికి తెలియజేశారు.

బరిలో నలుగురు అభ్యర్థులు

రెండు వైస్ చైర్మన్ల పదవులకు నలుగురు అభ్యర్థులు పోటీపడ్డారు. అందులో వైఎస్సార్‌సీపీ నుంచి ఇద్దరు, మరో ఇద్దరు ఫిరాయింపుదారులు నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున కందుకూరు యానాదిరెడ్డి, బిట్రగుంట ప్రమీలమ్మ నామినేషన్ల ప్రతాలతోపాటు బీఫారంలు కూడా దాఖలు చేశా రు. టీడీపీ తరఫున ఎవ రూ నామినేషన్లు దాఖలు చేయలేదు. ఈ క్రమంలో యర్రబపల్లి వెంకట శివకుమార్‌రెడ్డి, షేక్ నస్రీన్ కూడా బరిలో నిలబడుతున్నట్లు నామినేషన్లు ఎన్నికల అధికారికి అందజేశారు. యనాదిరెడ్డిని ప్రతిపాది స్తూ షేక్ షాహుల్ ప్రతిపాదించగా, కంఠ అనంతమ్మ బలపరిచారు. ప్రమీలమ్మను ప్రతిపాదిస్తూ యానాదిరెడ్డి బలపరచగా, మోర్ల జయంతి బలపరిచారు. శివకుమార్‌రెడ్డిని జువ్విగుంట కల్యాణ్ ప్రతిపాదించగా, షేక్ రహమద్ బలపరిచారు. నస్రీన్‌ను తాళ్ల వైష్ణవి ప్రతిపాదించగా, అందే ప్రత్యూష బలపరిచారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు 6, ఇండిపెండెంట్లకు 15 ఓట్లు

నగర పంచాయతీలో 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 12 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. తాజాగా జరిగిన వైస్ చైర్మన్ల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కందుకూరు యానాదిరెడ్డి, బిట్రగుంట ప్రమీలమ్మలకు ఆరు ఓట్లు రాగా, ఇండిపెండెంట్ అభ్యర్థులు యర్రబపల్లి వెంకట శివకుమార్‌రెడ్డి, షేక్ నస్రీన్‌కు 14 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోఆప్షన్ ఓటుతో కలిపి 15 ఓట్లు వచ్చాయి.

విజేతలు ఏ పార్టీయో చెప్పలేని దుస్థితి

ఎన్నికల ప్రక్రియ అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గెలుపొందిన వారు టీడీపీ వారు కాదని పేర్కొన్నారు. అయినప్పటికి తమ ఓటు ద్వారా వైస్ చైర్మన్‌లుగా ఎన్నుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఎన్నికల అధికారి శ్రీధర్‌రెడ్డి సైతం రెబల్ అభ్యర్థులు పోటీ చేసి గెలుపొందారని స్పష్టం చేశారు.

నేతన్న బతుకు చిక్కులు

గత ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలిస్తామని కూటమి హామీ

- చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ కల్పన
- పవర్‌లూమ్స్‌కు 500, హ్యాండ్లూమ్స్‌కు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం
- ఏ హామీ అమలు కాని వైనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తం కింద ఏటా రూ.24 వేలు సాయం

సొంత మగ్గం కలిగిన చేనేత కుటుంబాలు కూటమి ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో విలవిలలాడుతున్నాయి. గత ప్రభుత్వం అందరికీ ఇచ్చినట్లే సంక్షేమ పథకాలతోపాటు ప్రత్యేకంగా మగ్గం ఉన్న లబ్ధిదారులకు ఏటా సాయం అందించింది. కానీ టీడీపీ అధికారంలోకి రాక ముందు అలవికానీ హామీలిస్తుంది.. అధికారం దక్కాక ప్లేటు ఫిరాయిస్తోంది. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇలాంటి హామీలే ఇచ్చి మరోసారి మోసం చేయడంతో నేతన్న కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయాయి.

సంగం: జిల్లాలో చేనేత కుటుంబాల బతుకులు చిక్కుల్లో పడ్డాయి. రెక్కలు ముక్కలు చేసుకుని వస్త్రాలు నేసే నేతన్నలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. వస్త్ర తయారీ రంగంలోకి యంత్రాలు రావడంతో చేనేత వస్త్రాలకు డిమాండ్ కొరవడింది. కనీసం మగ్గం ఎక్కి నేత నేయాలన్నా.. అవసరమైన ముడిసరుకు కొనుగోలుకు చేతిలో పెట్టుబడి లేక షావుకారుల దగ్గర అప్పులు తెచ్చుకుని, కుటుంబమంతా కష్టపడినా.. కడుపు నిండా తినలేని దుర్భర స్థితిని అనుభవిస్తున్నారు. బతుకుదెరువుకు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు ఉన్నాయి.

ఉదారంగా ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులను ఉదారంగా ఆదుకున్నారు. అందరితో పాటు అన్ని సంక్షేమ పథకాలు అందించడంతోపాటు ప్రత్యేకంగా ఏటా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద రూ.24 వేలు వంతున అందించారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 4110 కుటుంబాలకు సాయం అందించారు. విభజన జిల్లాలోనూ 3,316 మందికి ఈ పథకాన్ని వర్తింపచేశారు. ఆ తర్వాత కాలంలోనూ సొంత మగ్గాలు పెరగడంతో ఏటా లబ్ధిదారుల సంఖ్యను కూడా పెంచుకుంటూ వచ్చారు. చివరగా 3,817 మందికి సాయం అందించారు. గడిచిన ఐదేళ్లలో ఆయా కుటుంబాలకు కేవలం వైఎస్సార్ నేతన్న నేస్తం కింద రూ.44,91,60,000 సాయంగా అందించారు. అర్హత కలిగిన చేనేత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందించే ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయడంతో వారు నమ్ముకున్న వృత్తిని కొనసాగిస్తూ ఎంతో ఆనందంగా గడిపారు.



సంగంలో మగ్గం నేస్తున్న నేత కార్మికురాలు

ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సాయం

సంవత్సరం	చేనేత మగ్గాలు	లబ్ధిదారులకు అందిన మొత్తం
2019-20	4,110	రూ.9,86,40,000
2020-21	3,833	రూ.9,19,92,000
2021-22	3,316	రూ.7,95,84,000
2022-23	3,639	రూ.8,73,36,000
2023-24	3,817	రూ.9,16,08,000

టీడీపీ హయాంలో ప్రోత్సాహం కరువు

హామీలతో ఊరించడం.. ఊహల్లో విహరింపచేయడం, అంతా అయ్యాక మోసం చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి అలవాటుగా మారింది. 2014లో నమ్మి ఓట్లు వేసిన నేతన్నలను మోసం చేసినట్లుగానే 2024లోనూ కొనసాగిస్తున్నారు. 2014 ఎన్నికల్లో నెలనెలా జీవన భృతితో పాటు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 7 నెలలు అయినా ఇంత వరకు నేతన్నలకు ఎలాంటి ప్రోత్సాహం అందిస్తారో కూటమి ప్రభుత్వం స్పష్టం చేయక పోవడంతో నేతన్నలు అప్పులు చేసి తమ పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ఎన్టీఆర్ ప్రభుత్వ హయాం మాదిరిగా చీర–దోవతి పథకాన్ని పునరుద్ధరిస్తామని, చేనేత ఉత్పత్తులపై 90 శాతం రిబేటు ఇస్తామని, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్లూమ్స్‌కు 200 యూనిట్లు విద్యుత్ ఉచితం అంటూ 2024 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు.

సింగనపల్లిలో భూకబ్జాకు టీడీపీ నేతల యత్నం



చదును చేసిన ప్రభుత్వ భూమి

మర్రిపాడు: అధికార పార్టీ నేతల భూదాహానికి అంతే లేకుండా పోతోంది. తాజాగా మండలంలోని సింగనపల్లి సర్వే నంబర్లు 246, 247లోని ప్రభుత్వ భూములపై గ్రామానికి చెందిన టీడీపీ నేతలు వెంకటసుబ్బయ్య, ఈ శ్రీనివాసులు కన్నేశారు. సుమారు 30 ఎకరాల్లో ప్రభుత్వ భూమిని మంగళవారం రాత్రి చదును చేసి ఆక్రమించేందుకు సర్వం సిద్ధం చేశారు. భూముల్లోని చెట్లను తొలగించారు. ఆ ప్రాంతంలో జామాయిల్ మొక్కలు నాటి ఆ స్థలాన్ని తాము సాగు చేసుకుంటున్నామంటూ అధికారులకు చెప్పుకునేందుకు ఈ ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. సింగనపల్లి భూ ఆక్రమణ విషయం తహసీల్దార్ అనిల్‌కుమార్‌ను ప్రశ్నించగా ఆ భూములను మంగళవారం పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

గల్లంతైన ఎంబీబీఎస్ విద్యార్థి మృతి



తనయుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరు పట్టపుపాళెం తీరంలో ఆదివారం గల్లంతైన ఎంబీబీఎస్ విద్యార్థి షణ్ముగనాయుడు మృతిచెందాడు. గల్లంతైన ప్రాంతానికి కొద్ది దూరంలో బ్రేక్ వాటర్స్ రాళ్ల మధ్య మృతదేహాన్ని సోమవారం ఉదయం గుర్తించారు. ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి సముద్రంలో దిగి గల్లంతైన విద్యార్థి కోసం పెద్దఎత్తున గాలించారు. పోలీసులిచ్చిన సమాచారం మేరకు విశాఖపట్నం నుంచి కుటుంబసభ్యులు, బంధువులు నేలటూరు తీరానికి తరలివచ్చారు. నిర్జీవంగా మారిన కొడుకును చూసి తండ్రి కన్నీరుమున్నీరుగా రోదించడం స్థానికులను కలచివేసింది. మృతదేహాన్ని ఎస్సై శ్రీనివాసరెడ్డి పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లి గ్రామానికి చెందిన సింగనబోయిన చెన్నయ్య (62) సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. చెన్నయ్య కేన్సర్‌తో బాధపడుతూ పలుచోట్ల వైద్యం చేయించుకున్నాడు. అయినా వ్యాధి నయం కాకపోవడంతో మనోవేదనలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో అప్పుడప్పుడూ తీవ్ర కడుపునొప్పి కూడా వచ్చేదని, దీనిని తట్టుకోలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

తాబేళ్ల సంరక్షణకు చర్యలు

నెల్లూరు(అర్బన్): తాబేళ్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీశాఖాధికారి (డీఎఫ్‌ఓ – టెరిటోరియల్) మహబూబ్‌బాషా అన్నారు. సోమవారం సాయంత్రం వేదాయపాళెంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ మాట్లాడుతూ డిసెంబర్ నుంచి ఏప్రిల్ నెల వరకు తాబేళ్లు తీరంలో గుడ్లు పెట్టి సముద్రంలోకి వెళ్తాయన్నారు. ప్రస్తుతం అటవీ శాఖాధికారులు ఆ గుడ్లను సేకరించి హెచరీల్లో పిల్లలు పుట్టే వరకు ఇతర జంతువులు ఆ గుడ్లను తినకుండా కాపాడాలన్నారు. మత్స్యకారులు వారికి కేటాయించిన పరిధిని దాటి మెషీన్ బోట్లు, పెద్ద వలలతో వేట సాగిస్తున్నారన్నారు. తాబేళ్లు వలల్లో చిక్కుకుని మృత్యువాత పడుతున్నాయన్నారు. అలా జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. తాబేళ్లు గుడ్లు పెట్టే కాలంలో సంప్రదాయ బోట్లను మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఫిషరీష్ శాఖ ఏడీ బాబు, ట్రీ ఫౌండేషన్ అధికారి నరేష్, రేంజర్ మాల్యాద్రి, ఎఫ్‌డీఓలు సంజయ్‌స్టీఫెన్, పూజిత, లక్ష్మానాయక్, శ్రీనివాసులు, సురేష్‌బాబు, కావలి ఎఫ్ఆర్‌ఓ రామిరెడ్డి, నరసయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి శామ్‌సంగ్ ఎస్25 స్మార్ట్ ఫోన్



నెల్లూరు(బృందావనం): శామ్‌సంగ్ ఎస్25 స్మార్ట్ ఫోన్‌ను సోమవారం మినీబైపాస్‌రోడ్డులోని శ్రీ వైజయంతి శామ్‌సంగ్ స్మార్ట్ కేఫ్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా స్మార్ట్ కేఫ్ ప్రొప్రైటర్ తులసీరామిరెడ్డి వివరాలు వెల్లడించారు. రూ.21 వేల విలువైన శామ్‌సంగ్ ఎక్స్‌క్లూజివ్ ఆఫర్‌తోపాటు ఈ ఫోన్‌ను వడ్డీలేని జీరో శాతం ఈఎంఐ ఫైనాన్స్‌లో సొంతం చేసుకునే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ కేఫ్‌లో శామ్‌సంగ్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, టాబ్స్, ల్యాప్‌టాప్ తదితర ఉత్పత్తులు లభిస్తాయన్నారు.

దూరం నుంచి వచ్చి.. అర్జీలిచ్చి..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- వివిధ సమస్యలపై 294 అర్జీలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం వినతి
- బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలంటూ అర్జీ అందజేత



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఇతర అధికారులు

నెల్లూరు రూరల్: 'చాలా దూరం నుంచి వచ్చామయ్యా.. మా సమస్యలకు పరిష్కారం చూపండి' అని ప్రజలు అధికారులను కోరారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగా భవాని తదితరులు సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 294 అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 128, మున్సిపల్ శాఖవి 18, పోలీస్ శాఖవి 11, సర్వేవి 11, పంచాయతీరాజ్‌వి 25, మిగిలిన శాఖలకు చెందినవి ఉన్నాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం..

'ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర కన్నా మిల్లర్లు చాలా తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి' అని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కోతలు మొదలుకాక ముందే మిల్లర్లు ధరలు తగ్గించారని, కోతలు వచ్చాక ఇంకెంత తగ్గిస్తారో చెప్పలేమన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

'సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలి' అని ఆంధ్రప్రదేశ్ అంధుల సమాఖ్య సభ్యులు అర్జీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాలకు మమ్మల్ని ప్రథమ అర్హులుగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని నెల్లూరు నగర పరిధిలో శాశ్వతంగా ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ రేషన్‌కార్డులు పూర్తి చేయాలని కోరారు.

నిధులు విడుదల చేసి ఆదుకోండి

'నెల్లూరు కార్పొరేషన్ 2007 – 08 ఆర్థిక సంవత్సరం నుంచి 2022 – 23 వరకు జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.35.64 కోట్ల గ్రంథాలయ పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారికి, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారికి పింఛన్లు, జీతాలు ఇచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రూ.2 కోట్లు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలి' అని జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు.

దళితుల భూముల ఆక్రమణ

ఆత్మకూరులో దళితుల భూములను ఆక్రమించి దొంగ రిజిస్ట్రేషన్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ సేన వ్యవస్థాపకుడు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు కొప్పాల రఘు కోరారు. ఆత్మకూరు వెంకటమ్మ, వరలక్ష్మి, సుబ్బలక్ష్మి, యశోద పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు మేరకు గిరిజన జనాభాపై గణన జరిపి తద్వారా ఎస్టీ వర్గీకరణ చేయాలని కలెక్టర్‌కు యానాది సంఘాల మహాకూటమి రాష్ట్రాధ్యక్షుడు బాపట్ల వెంకటపతి యానాది వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 35 గిరిజన ఉపతెగలు ఉన్నాయని, 40 లక్షల పైచిలుకు గిరిజన జనాభా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏకల సుధీర్‌బాబు, ఇళ్ల సుధాకర్, గండల రమేష్ బాబు, చలంచర్ల శ్రీనివాసులు, సేలం శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై..

2020 – 21లో ప్రభుత్వం విడుదల చేసిన ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు నాలుగో తరగతికి సంబంధించినవి అప్పట్లో కొందరికి ఇచ్చారని, మిగిలిన వాటిని వెంటనే భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమరగిరి మహేంద్రబాబు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ సాధికారిక అధికారి కొంత మందికి ఇచ్చి మరికొంత మందికి ఆపి ఉండటంపై గతంలో అర్జీ ఇచ్చామన్నారు. మళ్లీ విచారించి వెంటనే పోస్టులు భర్తీ చేయాలని కోరామన్నారు. లేకపోతే అన్ని ఎస్టీ, ఎస్సీ సంఘం నాయకులతో కలిసి ఉద్యమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యానాది మహానాడు జిల్లా అధ్యక్షురాలు సత్యవతమ్మ, గిరిజన హక్కుల పోరాట సమితి రాష్ట్రాధ్యక్షుడు ఇండ్ల రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేంద్రబాబు

చేతులెత్తేసిన టీడీపీ

- నెల్లూరు డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే
- టీడీపీకి మద్దతు తెలిపిన కార్పొరేటర్లకు రాజకీయ భవిష్యత్ ఉండదు
- ఫిరాయింపుదారులను ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడుతాం
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖరరెడ్డి

నెల్లూరు (బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ చేతులెత్తేసిందని, ఈ ఎన్నికల్లో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదేనని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లోని కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున అభ్యర్థిని నిలబెట్టలేకపోయిందని, తమ పార్టీ తరఫున షేక్ కరిముల్లాను బీఫారంతో పోటీ చేయించామన్నారు. టీడీపీది కనీసం బీఫారం కూడా ఇవ్వలేని దుస్థితి అన్నారు. ఆ పార్టీకి అభ్యర్థి లేక.. గత్యంతరం లేక వైఎస్సార్‌సీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన సయ్యద్ తహసీన్‌ను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీకి నిలిపిందని ఎద్దేవా చేశారు. ఇండిపెండెంట్‌గా అభ్యర్థిని పెట్టుకుని వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలుపొందిన కార్పొరేటర్లతో ఓట్లు వేయించుకుని టీడీపీ డిప్యూటీ మేయర్ పదవి గెలుచుకుందంటూ శునకానందం పొందుతుందన్నారు. టీడీపీకి మద్దతు తెలిపిన ఏ ఒక్క కార్పొరేటర్‌కు రాజకీయ భవిష్యత్ ఉండదన్నారు. వైఎస్సార్‌సీపీ విప్ జారీ చేసిందన్న భయంతోనే టీడీపీ ఇండిపెండెంట్‌గా పోటీకి దిగిందన్నారు. డిప్యూటీ మేయర్‌గా గెలుపొందిన అభ్యర్థి ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తి అని ఎన్నికల అధికారిని అడిగితే సమాధానం చెప్పలేదన్నారు. జరుగుతున్న పరిస్థితులను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. పార్టీ ఫిరాయింపుదారులను ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడుతామన్నారు. తమ పార్టీ బీ ఫారంతో పోటీ చేసిన అభ్యర్థికి ఓట్లు వేయని వారందరూ విప్ ఉల్లంఘించినట్లేనని, వీరంతా అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ఈ రోజు ఓటమి రేపటి గెలుపునకు నాంది పలుకుతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలబడి టీడీపీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు దిశగా ప్రజలతో కలిసి పోరాటాలు సాగిస్తుందని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు.

ఎనిమిది సవర్ల బంగారం చోరీ

ఉలవపాడు: మండల కేంద్రం ఉలవపాడులోని వడ్డెరపాళెంలో ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉలవపాడుకు చెందిన పాకల అరుణ, ప్రసాద్ దంపతులు ఇంట్లో నిద్రపోయారు. సోమవారం తెల్లవారుజామున వారు లేచి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులోని 6 సవర్ల చైన్, 2 సవర్ల కమ్మలు, ఉంగరాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు, సాంకేతిక వివరాలు సేకరించింది. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాజంపై కేన్సర్ పడగ

- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- జిల్లాలో ఇప్పటికే 30 వేలమంది రోగులు
- అవగాహనతోనే చెక్



నెల్లూరు(అర్బన్): కేన్సర్ సమాజాన్ని పట్టిపీడిస్తోంది. జిల్లాలో దీని బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 30 వేల మందికి పైగా కేన్సర్ రోగులున్నట్టు తెలుస్తోంది. ఓ వైపు ఆస్పత్రుల సంఖ్య పెరుగుతున్నా రోగుల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీని ప్రపంచ కేన్సర్ దినోత్సవంగా ప్రకటించింది. ప్రజలకు ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తోంది. కేన్సర్‌ను తగ్గించడానికి, కేన్సర్‌తో బాధపడుతున్న వారికి అండగా ఉండి ధైర్యం చెప్పడానికి 2025 – 27 సంవత్సరాలకు 'యునైటెడ్ బై యూనిక్' థీమ్‌ను ప్రకటించింది. జిల్లా వైద్యారోగ్య శాఖ పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది.

వివిధ ఆస్పత్రుల్లో..

పెద్దాస్పత్రిలో కేన్సర్ సేవలు ప్రారంభమై రెండేళ్లు పూర్తయ్యాయి. అయితే ఇక్కడ రేడియేషన్ మాత్రమే లేదు. సర్జన్లు, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్లున్నారు. సరాసరిన రోజుకు ఆరుగురు కీమోథెరపీ చేయించుకుంటున్నారు. పెద్దాస్పత్రిలోని కేన్సర్ విభాగంలో కూడా ఆరోగ్యశ్రీ కింద అన్ని రకాల మందులు అందుబాటులోకి తెచ్చి వైద్యం చేస్తున్నారు. పలు ప్రైవేట్ హాస్పిటళ్లలో కీమో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. కొందరు రోగులు చెన్నై, తిరుపతి, హైదరాబాద్ వెళ్లి కేన్సర్ చికిత్సలు పొందుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తేనే..

కేన్సర్ సైలెంట్ కిల్లర్.. మూడు, నాలుగు స్టేజీల వరకు చాలామందిలో బయటపడటం లేదు. దీంతో పలువురు అకాల మరణం చెందుతున్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే తక్షణ వైద్యం పొంది సులభతరంగా కోలుకునేందుకు వీలవుతుంది. కుటుంబంలో ఎవరికైనా కేన్సర్ ఉంటే ఆ ఇంట్లో 30 సంవత్సరాల వయసు దాటిన తర్వాత వారు సంవత్సరానికి ఒక దఫానైనా స్కానింగ్ లాంటి పరీక్షలు చేయించుకోవాలి. కేన్సర్ ఉన్నట్లు గుర్తిస్తే తొలిదశలోనే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చు.

రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను పరిశీలిస్తే..

సంవత్సరం	సర్జరీలు	రేడియేషన్ పొందిన వారు	కీమో చేయించుకుంది
2021	1,114	547	7,106
2022	886	536	9,497
2023	834	547	10,739
2024	615	409	8,871

(సెప్టెంబర్ వరకు)

- జిల్లాలోని ఓ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 10 వేల మందికి పైగా కీమోథెరపీ, రేడియేషన్, సర్జరీ వైద్యసేవలు పొందారు. రోజూ ఐదుగురి నుంచి ఏడుగురికి వివిధ రకాల సర్జరీలు జరుగుతున్నాయి.

మంచి అలవాట్లతో..



కేన్సర్ కేసులు ఎక్కువవుతున్నాయి. మత్తు పదార్థాలు, ధూమపానం, మద్యంకు దూరంగా ఉండాలి. ప్రాసెస్డ్, జంక్ ఫుడ్ తీసుకోకూడదు. ఒత్తిడి తగ్గించుకోవాలి. సాయంత్రం త్వరగా ఆహారం తీసుకోవాలి. తగినంత నిద్ర పోవాలి.

– డాక్టర్ నాగేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్, రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్

వైద్య పరీక్షలు తప్పనిసరి



30 సంవత్సరాల వయసు దాటిన స్త్రీలు, పురుషులు ప్రతి సంవత్సరం ఒక దఫా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం మంచిది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో అన్ని రకాల స్క్రీనింగ్ పరీక్షలున్నాయి. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సీటీ, ఎంఆర్‌ఐ లాంటి పరీక్షలున్నాయి. బయాప్సీ ఇక్కడే చేస్తున్నాం. రూపాయి ఖర్చు లేకుండా ఉచిత వైద్యం పొందవచ్చు.

– డాక్టర్ పద్మావతి, హెచ్‌ఓడీ, రేడియాలజీ ఆంకాలజిస్ట్, సర్వజన ఆస్పత్రి

ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సీసీని నిర్బంధించిన ఘటనలో ఇద్దరు నిందితులను నెల్లూరు దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 25వ తేదీన నగరపాలక సంస్థ కమిషనర్ సీసీ ప్రవీణ్ కుమార్‌ను నిర్బంధించిన ఘటనలో మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్, అతని అనుచరులు సుభాష్‌చంద్రబోస్‌నగర్‌కు చెందిన అరుణ్‌కుమార్, బుజబుజ నెల్లూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన సిరాజ్‌లపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అదేరోజు జయవర్ధన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం అరుణ్‌కుమార్, సిరాజ్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో జేసీ కార్తీక్

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: 'ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రోజుకు లక్ష పనిదినాలే లక్ష్యం' అని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి వివిధ అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. చాలా మండలాలు పనుల కల్పనలో వెనుకబడి ఉన్నాయని, ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ రోడ్లు తదితర నిర్మాణాలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని, ఈ మేరకు హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఎంఎస్ఎంఈ సర్వేను పూర్తి చేసేందుకు ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 145

సర్టిఫికెట్లు ఇవ్వకుండా..

- కళాశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతోంది
- పోలీసులకు ఫిర్యాదు

ఆత్మకూరు: సర్టిఫికెట్లు ఇవ్వాలని కళాశాల యాజమాన్యాన్ని కోరితే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓ విద్యార్థి సోమవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులోని వివరాల మేరకు.. నెల్లూరుపాళెం బీసీకాలనీకి చెందిన కాటేపల్లి సురేష్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సురేంద్ర పట్టణంలోని బీఎస్సార్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాడు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. తన ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం ఇటీవల ఇంటర్ కాలేజీకి వెళ్లగా రూ.20 వేలు ఫీజు బాకీ ఉన్నావని ఆ మొత్తం చెల్లిస్తే ఇస్తామని వారు తెలిపారు. దీంతో సురేష్, సురేంద్రలు తమ కుటుంబ పరిస్థితి అంతంతమాత్రంగా ఉందని వివరించగా రూ.10 వేలు కడితే సర్టిఫికెట్లు ఇస్తామని బీఎస్సార్ యాజమాన్యం తెలిపింది. సురేష్ ఆ మొత్తాన్ని రెండు రోజుల క్రితం చెల్లించాడు. దీంతో పదో తరగతి, టీసీలను ఒరిజినల్ ఇవ్వగా, ఇంటర్ మార్కుల మెమో జెరాక్స్ కాపీ సురేంద్ర చేతికొచ్చాయి. దీనికోసం అడిగితే మిగిలిన రూ.10 వేలు చెల్లించాలని తెగేసి చెప్పారు. ఈ విషయాన్ని తండ్రీకొడుకులు సోమవారం ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాలతో తహసీల్దార్ సుధీ ర్ బీఎస్సార్ కళాశాల యాజమాన్యానికి ఫోన్ చేసి సురేంద్రను ఇబ్బంది పెట్టొద్దన్నారు. అయితే ఆ విద్యార్థి సర్టిఫికెట్లు తీసుకున్నాడని, అలా అని సంతకం సైతం చేశాడని యాజమాన్యం తెలిపింది. రెవెన్యూ అధికారులకు తెలిపామని కక్ష సాధింపుతో కళాశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతోందని సురేష్ కన్నీరుమున్నీరయ్యాడు. దీంతో తహసీల్దార్ వారిపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఆయన ఆదేశాలతో ఎస్సై ఎస్కే జిలానీకి రాతపూర్వకంగా వారు ఫిర్యాదు చేశారు.



ఎస్సై జిలానీకి ఫిర్యాదు చేస్తున్న సురేంద్ర, సురేష్